# ముఖ్యమంత్రి కార్యాలయము

## తెలంగాణ ప్రభుత్వం

**పత్రికా ప్రకటన** **తేది: 01-12-2015**

అత్యంత వెనకబడిన తూర్పు ఆదిలాబాద్ ప్రాంతంపై మంత్రులు, అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపించి అభివృద్ధి కార్యక్రమాలు అమలు జరిగేలా చూడాలని ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర్ రావు సూచించారు. నీటి పారుదల ప్రాజెక్టులు, రహదారులు, వంతెనల నిర్మాణం, విద్యుత్ సబ్ స్టేషన్ల ఏర్పాటు, వైద్య సదుపాయాల మెరుగుదల తదితర అంశాలపై ఎక్కువ దృష్టి పెట్టాలని చెప్పారు. ప్రభుత్వ విప్ నల్లాల ఓదేలు, ఎమ్మెల్యేలు కోవా లక్ష్మి, విఠల్ రెడ్డి, చిన్నయ్య, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్ రెడ్డి, సిఎం ముఖ్య కార్యదర్శి నర్సింగ రావు, సిఎం అదనపు కార్యదర్శి శాంతకుమారి తదితరులతో క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు.

ఎమ్మెల్యేలను అడిగి అక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, ఇబ్బందులు తెలుసుకున్నారు. ఆ ప్రాంతంలో తక్షణం చేయాల్సిన పనులను, దీర్ఘకాలిక ప్రాతిపదికన చేపట్టాల్సిన పనులను గుర్తించారు. ప్రతీ మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి డబుల్ రోడ్డు వేయాలని ప్రభుత్వం ఓ విధానం పెట్టుకున్నదని, దాని ప్రకారం ఆదిలాబాద్ జిల్లాలో కూడా అన్ని మండల కేంద్రాలకు డబుల్ రోడ్డు ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. కొన్ని గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి పోవడానికి నదులు, కాల్వలు దాటే క్రమంలో పడవలు ఉపయోగించాల్సి వస్తున్నదని సిఎం అన్నారు. అలాంటి ప్రాంతాలను గుర్తించి వంతెనలు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, దాన్ని వేగంగా అమలు చేయాలని సిఎం అన్నారు. రహదారులు, వంతెనల నిర్మాణ పనుల్లో వేగం పెంచడానికి ఆయా ప్రాంతాల్లో స్వయంగా పర్యటించాలని రోడ్లు భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, పంచాయితీ రాజ్ శాఖ మంత్రి కెటి రామారావును సిఎం కోరారు. మంచిర్యాల – చంద్రాపూర్ నాలుగు లేన్ల జాతీయరహదారి నిర్మాణ పనులను కూడ పర్యవేక్షించాలన్నారు.

ఆదిలాబాద్ జిల్లాలో పెండింగ్ లో ఉన్న ఎత్తిపోతల పథకాలను వెంటనే పూర్తి చేయాలని నీటి పారుదల శాఖ మంత్రి హరీష్ రావుకు సూచించారు. తూర్పు ఆదిలాబాద్ ప్రాంతంలో అదనపు సబ్ స్టేషన్ల నిర్మాణం కూడా నత్త నడకన నడుస్తున్నదని, ఈ పనులను స్వయంగా పర్యవేక్షించాలని విద్యుత్ శాఖ మంత్రి జగదీష్ రెడ్డికి చెప్పారు. రెండు మూడు రోజుల్లోనే ఆదిలాబాద్ జిల్లాకు చెందిన మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులతో సమావేశం నిర్వహించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

కొమురం భీమ్ వారసులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు

-------------------------------------------------------

ఆదిలాబాద్ జిల్లా జోడేఘాట్ లో కొమురం భీమ్ వారసులందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పథకం కింద గృహాలు మంజూరు చేయాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవా లక్ష్మి ముఖ్యమంత్రిని కోరారు. కొమురం బీమ్ వారసులకు చెందిన 15 కుటుంబాలు గ్రామంలో ఉన్నాయని, వారందరికీ ఇండ్లు మంజూరు చేయాలని చెప్పారు. దీనికి ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు.

**సిపిఆర్ఓ టు సిఎం**